# నేడు స్టేషన్‌ఘన్‌పూర్‌కు ప్రగతి ప్రదాత

- ప్రజా ఆశీర్వాద సభకు రానున్న బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్
- శివారెడ్డిపల్లి శివారులో భారీ బహిరంగ సభ
- నియోజకవర్గం నలుమూలల నుంచి లక్ష మంది తరలివచ్చే అవకాశం
- బీఆర్‌ఎస్ నాయకుల విస్తృత ఏర్పాట్లు


శివారెడ్డిపల్లిలో హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి

జనగామ, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ) : గులాబీ దళపతి, ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు రానున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పెద్దఎత్తున ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. అధినేత సభను విజయవంతం చేసేందుకు బీఆర్‌ఎస్ శ్రేణులు ఇప్పటికే సన్నాహక సమావేశాలు నిర్వహించి భారీగా జన సమీకరణకు దిశానిర్దేశం చేశాయి. శివారెడ్డిపల్లి శివారులోని మైదానంలో జరిగే భారీ ఎన్నికల బహిరంగ సభకు సర్వం సిద్ధమైంది. వేదిక, సభా ప్రాంగణం, కుర్చీలు, లైటింగ్, షామియానాలు వంటి ఏర్పాట్లతో ముస్తాబైంది. సోమవారం కేసీఆర్ రాకను పురస్కరించుకొని సభా పరిసరాలు సర్వాంగ సుందరంగా, గులాబీమయంగా మారింది. బహిరంగసభ ప్రాంగణం, వేదిక వద్ద ఎలాంటి లోటు రాకుండా అన్నీ సిద్ధం చేశారు. వేదిక నిర్మాణం, బారికేట్ల ఏర్పాటు, గ్రౌండ్ చదును, లైటింగ్, సౌండ్ సిస్టమ్ వంటి ఏర్పాట్లు పూర్తయ్యాయి. కేసీఆర్ హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో నేరుగా 12.30 గంటలకు సభా స్థలికి చేరుకొని ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతారు. ఎన్నికల ప్రచారం దగ్గర పడుతున్న తరుణంలో జరిగే సభ రాజకీయ ప్రాధాన్యం నెలకొనే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా, సీఎం కేసీఆర్ రాక సందర్భంగా అవాంఛనీయ సంఘటలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

**చరిత్రలో నిలిచిపోయేలా బహిరంగ సభ..**

రాఘవపూర్-నష్కల్ గ్రామాల శివారులోని 50 ఎకరాల్లో స్టేషన్‌ఘన్‌పూర్ చరిత్రలో నిలిచిపోయేలా సభ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. జర్మనీ స్ట్రక్టర్ షామియానాలు, వేలాది మంది కూర్చునేందుకు వీలుగా కుర్చీలు, లక్షలాది మజ్జిగ, మంచినీళ్ల ప్యాకెట్లు, అంబులెన్స్‌లు, వైద్య బృందాలు, వాహన పార్కింగ్ వంటి అన్ని ఏర్పాట్లు చేశారు. హెలిప్యాడ్ నుంచి సభాస్థలికి 5 నిమిషాల్లో చేరుకొని తిరిగి వెళ్లిపోయేలా హెలిప్యాడ్ నిర్మించారు. లక్ష మందికి పైగా సామర్థ్యం ఉన్న గ్రౌండ్‌లో బారికేడ్లు, షామియానాలు, టెంట్లు, మంచినీటి వసతి కల్పిస్తున్నారు. ఇప్పటికే సీఎం కేసీఆర్ పాల్గొనే సభా వేదిక, హెలిప్యాడ్ వంటి ఏర్పాట్లను బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి పరిశీలించారు. బందోబస్తు సహా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు, వీవీఐపీ, వీఐపీల వాహన పార్కింగ్ వంటి అంశాలపై జిల్లా పోలీసు అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

### సీఎం కేసీఆర్ రాక కోసం ఎదురుచూస్తున్న ప్రజలు



'స్టేషన్‌ఘన్‌పూర్‌కుముఖ్యమంత్రి వస్తున్నందున ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సీఎం కేసీఆర్ జనగామను జిల్లా కేంద్రం చేయడంతోపాటు స్టేషన్‌ఘన్‌పూర్‌ను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా మార్చారు. వందలకోట్ల నిధులు ఇవ్వడంతో అద్భుతమైన అభివృద్ధి చేసుకోగలిగాం. దేవాదుల ఎత్తిపోతల ద్వారా అందుతున్న సాగునీరు వ్యవసాయాన్ని పండుగలా మార్చింది. సాగు, తాగునీటికి సమస్య లేదు. రైతు బంధు, ఆసరా పింఛన్లు, గృహలక్ష్మి, దళితబంధు వంటి సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవయ్యాయి. అందుకే సీఎం కేసీఆర్‌ను చూడాలని, ఆయనకు కృతజ్ఞతలు చెప్పాలని ఎదురుచూస్తున్నారు. అధినేత చెప్పే మాటలు వినాలని సాధారణ ప్రజలు, రైతు కుటుంబాలు సొంత వాహనాలు, ట్రాక్టర్లు, ఆట్లో స్వచ్ఛందంగా సిద్ధమవుతున్నారని మా పార్టీ శ్రేణుల ద్వారా సమాచారం అందుతున్నది. బహిరంగ సభకు ఏర్పాట్లు కూడా ఆ స్థాయిలోనే చేస్తున్నాం.''

– కడియం శ్రీహరి, బీఆర్‌ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ అసెంబ్లీ అభ్యర్థి

**ప్రజా ఆశీర్వాద సభకు లక్ష మంది**

స్టేషన్ ఘన్‌పూర్ : మండలంలోని శివారెడ్డిపల్లి వద్ద నేడు సీఎం కేసీఆర్ నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి స్వచ్ఛందంగా లక్షమంది తరలి వస్తారని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం బహిరంగ సభ ఏర్పాట్లు, హెలిపాడ్ స్థలాన్ని పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులకు ఆయన పలు సూచనలిచ్చారు. అనంతరం కడియం శ్రీహరి మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌ను చూసేందుకు, వారి ప్రసంగాన్ని వినేందుకు పార్టీ శ్రేణులతోపాటు వివిధ వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలిరానున్నారని వివరించారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో తొమ్మిదిన్నరేళ్లుగా చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రతి గ్రామంలో జరిగిన ప్రగతి కళ్లముందు కనిపిస్తున్నదన్నారు. ఈ క్రమంలో సీఎం కేసీఆర్‌కు మద్దతు తెలుపాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. నాకు రాజకీయ జీవితాన్ని ఇచ్చిన ఈ నియోజకవర్గ ప్రజలకు సేవ చేసి, వారి కష్ట సుఖాల్లో పాలు పంచుకుని అభివృద్ధి చేయాలనే ప్రత్యేక ప్రణాళికతో ఉన్నానని ఆయన అన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓట్లేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కడియం శ్రీహరి ప్రజలను కోరారు. సోమవారం మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రజలు బీఆర్‌ఎస్ శ్రేణులు, అభిమానులు సభాస్థలికి చేరుకోవాలని కోరారు.

**పార్కింగ్ స్థలాల్లోనే వాహనాలు నిలపాలి : ఏసీపీ**

సీఎం కేసీఆర్ సభకు వచ్చే వాహనదారులు తమ వాహనాలను పార్కింగ్ స్థలాల్లోనే నిలుపాలని మధ్యం సేవించి వాహనాలను నడుపొద్దని ఏసీపీ శ్రీనివాస్‌రావు కోరారు. బహిరంగ సభ సజావుగా సాగేందుకు, ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఆరుగురు డీఎస్పీలు, సుమారు 500 మంది పోలీస్ సిబ్బంది విధుల్లో ఉంటారని ఆయన తెలిపారు.


ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

## కాంగ్రెస్‌కు ఓటేస్తే గోసపడుతం

**బీఆర్‌ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి**

జనగామ చౌరస్తా, నవంబర్ 19 : కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే అవినీతి, దోపిడీ కొనసాగుతుందని బీఆర్‌ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రజలు ఆలోచించి అభివృద్ధికి పట్టం కట్టాలని, బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఆదివారం జనగామ పట్టణం 19 వార్డులో రైతు బంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యతో కలిసి పల్లా ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక వార్డు కౌన్సిలర్ బండ పద్మ యాదగిరిరెడ్డి ఆధ్వర్యంలో పల్లాకు వార్డు ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మహిళా ఓటర్లు పల్లాకు బొట్లు పెడుతూ న్మానించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపుని చ్చారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తామని తెలిపారు. ప్రజలందరూ తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేశ్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు చెంచారపు పల్లవి, పట్టణ ఇంచార్జ్ ఏనుగు రాకేశ్‌రెడ్డి, భరత్ కృష్ణ, పాల్గొన్నారు.

**పల్లాకు పెయింటర్స్ అసోసియేషన్ మద్దతు**

బీఆర్‌ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి పెయింటర్స్ అసోసియేషన్ తమ సంపూర్ణ మద్దతు తెలిపింది. ఆదివారం విజయ మినీ వేడుకల మందిరంలో 150 మంది పెయింటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పల్లా సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు.

## ప్రజా ఆశీర్వాద సభకు పెద్ద ఎత్తున తరలిరావాలి

స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 19: నేడు స్టేషన్‌ఘన్‌పూర్‌లో జరిగే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని చిల్పూరులోని బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థాన డైరెక్టర్ పొన్నం రజిత కోరారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ మహిళల అభివృద్ధికి పెద్ద పీట వేశారని తెలిపారు. కేసీఆర్ కిట్, అమ్మఒడి వాహనం, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, పథకాలు ఎంతగానో ప్రజాదరణ పొందాయని తెలిపారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలో ప్రజల కోసం మరెన్నో సంక్షేమ పథకాలు పొందుపర్చారని వివరించారు. మహిళల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న పథకాలను తెలిపారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కడియం శ్రీహరిని భారీ మెజార్టితో గెలిపించాలని ఆమె కోరారు.


స్వామివారి కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

## వైభవంగా బుగులు వెంకన్న మాస కల్యాణం

**ఆలయానికి భారీగా తరలివచ్చిన భక్తజనం**

చిల్పూరు, నవంబర్ 19 : మండల కేంద్రంలోని శ్రీ బుగులు వేంకటేశ్వర స్వామి మాస కల్యాణం ఆదివారం ఘనంగా జరిగింది. కార్తీక మాసం శ్రవణా నక్షత్రం సందర్భంగా అర్చకులు ఉత్సవమూర్తులను అలంకరించి వేదమంత్రాలతో పూజలు చేశారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని కన్నులపండువగా కొనసాగించారు. స్వామివారిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం చిన్నపెండ్యాలకు చెందిన దాతలు జనగామ లక్ష్మియాదగిరి, కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు కిరణ్మయి దంపతులు, ఈవో బీ లక్ష్మిప్రసన్న, ఆలయ శాశ్వత దాత మాజీ దేవస్థాన డైరెక్టర్ సంగోజు లక్ష్మి-మోహన్ దంపతులు, ప్రధాన అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్‌శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, సిబ్బంది రమేశ్, వీరన్న, విశాల్, రాజశేఖర్, మహేశ్, మల్లికార్జున్, లక్ష్మి పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- బీఆర్‌ఎస్ పాలకుర్తి అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి
- తొర్రూరులో మార్నింగ్ వాకర్స్‌తో చిట్‌చాట్

తొర్రూరు, నవంబర్ 19 : బీఆర్‌ఎస్ పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వినూత్నరీతిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని తొర్రూరు మున్సిపల్ కేంద్రంలో ఆదివారం వేకువజామునే మార్నింగ్ వాకర్స్‌తో కలిసి నడిచారు. తొర్రూరు పట్టణ అభివృద్ధికి తాను చేసిన పనులను వివరిస్తూ మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని ప్రజలను కోరారు. యతిరాజారావు పార్క్ ఆవరణలో, అమ్మాపురం రహదారి వైపు, హైస్కూల్ ఆవరణలో మార్నింగ్ వాక్ చేస్తున్న వారితో, యువకులతో సరదాగా మాట్లాడారు. ఎన్నికల సరళిని వివరిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు తాను చేసిన అభివృద్ధిని గుర్తు చేశారు. మరోసారి గెలిచిన అనంతరం చేపట్టే అభివృద్ధి పనులపై హామీ ఇస్తూ తన ప్రచారాన్ని కొనసాగించారు. తొర్రూరు హైస్కూల్ గ్రౌండ్ ఆవరణలో టీచర్స్, క్రీడాకారులతో కలిసి వాలీబాల్ ఆడి సందడి చేశారు.

**సరదాగా చాయ్ అమ్ముతూ...**

మార్నింగ్ వాక్ అనంతరం మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అమ్మాపురం క్రాస్ రోడ్డులో ఉన్న టీస్టాల్ వద్ద స్వయంగా టీ తయారు చేశారు. తనతో వచ్చిన వారితో పాటు వాకర్స్, సామాన్య ప్రజానికానికి చాయ్ అందజేస్తూ సరదాగా సందడి చేశారు. ఆ తర్వాత బైక్‌పై పట్టణంలో చక్కర్లు కొడుతూ తాను చేసిన అభివృద్ధి పనులను పరిశీలిస్తూ హరిపిరాల క్రాస్ రోడ్డులో పారిశుద్ధ్య కార్మికులతో ముచ్చటించారు. వేకువజామునే ప్రారంభమైన ప్రచారం రెండు గంటల పాటు కొనసాగింది. స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు ఆయన వెంట ఉన్నారు. అనంతరం మండలంలోని చెర్లపాలెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు జినుగ మల్లారెడ్డి ఇటీవల మరణించగా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పార్టీపరంగా అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు.


తొర్రూరులోని హైస్కూల్ గ్రౌండ్‌లో వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి వాలీబాల్ ఆడుతున్న మంత్రి ఎర్రబెల్లి


అమ్మాపురం క్రాస్ రోడ్డులో టీ తయారు చేసి అందజేస్తున్న మంత్రి దయాకర్‌రావు

**బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక..**

నాంచారిమడూర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సోమయ్య, మహంకాళి మహిపాల్‌తో పాటు పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. కొడకండ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 150 మంది బీఆర్‌ఎస్‌లో చేరి ఎర్రబెల్లికి మద్దతు తెలిపారు. రాయపర్తి మండలం పోతిరెడ్డిపల్లి గ్రామ ఉపాధ్యక్షుడు లకావత్ శ్రీను, హుస్సేన్, దేవేందర్, సుమన్, బిచ్చా బీఆర్‌ఎస్‌లో చేరగా గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.